సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



బైక్‌ను ఢీకొట్టి..

కారుతో బైక్‌ను ఢీకొట్టి.. మూడు గ్రామాల ప్రజలను ముప్పతిప్పలు పెట్టి పారిపోతున్న ఇద్దరిని వెంబడించి పట్టుకున్నారు. 10లో▸



యూరియా తిప్పలు

యూరియా కోసం అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. రేయింబవళ్లు పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. 10లో▸



పేదలకు ఊరట

జీఎస్టీ సంస్కరణలు దేశాన్ని మరింత బలోపేతం చేస్తాయని, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 10లో▸

డెంగీ పంజా

మహేశ్వరం మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రికి క్యూ కట్టిన జ్వరపీడితులు



- ఇప్పటికే 274పైగా కేసుల నమోదు
- తాజాగా కొత్తూరులో బాలిక మృతి
- చాపకింద నీరులా విస్తరిస్తున్న విషజ్వరాలు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: డెంగీ చాపకింది నీరులా విస్తరిస్తూ మృత్యుఘంటికలు మోగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే అధికారికంగా 2748 పైగా కేసులు నమోదు కాగా అనధికారికంగా మరో వంద కుపైగా ఉన్నట్లు సమాచారం. వీరిలో ఇప్పటికే ఇద్దరు మృత్యువాతపడగా తాజాగా కొత్తూరు మండలం ఎస్‌బీపల్లికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక ఇదే జ్వరంతో బాధపడుతూ కన్నుమూసింది. అవగాహన లేక చాలామంది దీన్ని సాధారణ జ్వరంగా భావిస్తున్నారు. చికిత్సను నిర్లక్ష్యం చేస్తూ చివరికి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. ఏకధాటి వర్షాలు, వరదలకు తోడు పారిశుద్ధ్య లోపంతో బస్తీ వాసులతో పాటు మారుమూల ప్రాం తాల్లోని పేదలు జ్వరం, కీళ్లనొప్పులు, వాంతులు, విరేచనాలు ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. జిల్లాలోని 56 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోని ఓపీకి మేలో 1,32,442 మంది బాధితులు రాగా, జూన్‌లో 1,34,725 మంది, జూలైలో 1,43,962 మంది వచ్చారు. ఆగస్టులో ఈ సంఖ్య ఏకంగా రెండు లక్షలు దాటింది. ప్రతి నెలా పదివేల వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతుండగా తాజాగా ఆ సంఖ్య పాతికవేలు దాటడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

చికిత్సల పేరుతో..

తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, వాంతులు, చర్మంపై దద్దుర్ల వంటి లక్షణాలతో బాధపడుతూ ఆస్పత్రులకు చేరుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కొంత మంది వైద్యులు సాధారణ జ్వరాలను సైతం డెంగీ జాబితాలో చేర్చి.. ప్లేట్‌లెట్ కౌంట్స్ చికిత్సల పేరుతో నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. నిజానికి మనిషి రక్తంలో 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. జ్వర పీడితుల్లో ఇది కొంత తగ్గుతుంది. ప్రస్తుతం ఆస్పత్రులకు వస్తున్న చాలా మంది రోగుల్లో ప్లేట్‌లెట్ కౌంట్ 50 వేలపైనే ఉంటోంది. అంతకు తగ్గినోరు, ముక్కు నుంచి బ్లీడింగ్ అయితే వెంటనే ప్లేట్‌లెట్స్ పునరుద్ధరించాలి. లేదంటే షాక్‌కు గురై కోమాలోకి వెళ్లి చనిపోయే ప్రమాదం ఉంటుంది. కొంత మంది వైద్యులు ఐసీయూ చికిత్సల పేరుతో అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నారు. నిజానికి ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాదు ప్రైవేటు ఆ స్పత్రుల్లోని **డెంగీ బాధితుల వివరాలను సైతం జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు చేరవేయాల్సి ఉంటుంది. జిల్లాలోని ఏ ఒక్క కార్పొరేట్ ఆస్పత్రి కూడా రోగుల జాబితాను ఇవ్వడం లేదంటే ఆశ్చర్యపోనవసరం లేదు. అనుమానిత డెంగీగా నమోదు చేసి గుట్టుగా చికిత్సలు చేస్తుం** డటం కొసమెరుపు.

ఆ ప్రాంతాల్లో అధికం

కోకాపేట్, నార్సింగి, మణికొండ, గండిపేట్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్ ప్రాంతాల్లో డెంగీ కేసులు ఎక్కువ నమోదవుతున్నాయి. ఆకర్షణ, ఆహ్లాదం కోసం ఇంటి గుమ్మం ముందు కుండీల్లో మనీప్లాంట్స్ నాటుతుండటం, ఖాళీ ప్రదేశాల్లో రకరకాల పూలు, పండ్ల మొక్కలు పెంచుతుండటం, ఏకధాటి వర్షాలకు కుండీల నిండా నీరు చేరడం, ఇంటిపై ఖాళీ డబ్బాలు, ఇంటి పక్క ఖాళీ స్థలాల్లో కొబ్బరి బొండాలు, టైర్లు పడేయడంతో వాటిలో వర్షపు నీరు చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయి. ఇంటిపై ఉన్న నీటి ట్యాంకులపైనే కాదు సెల్లార్‌లో ఉన్న సంపుపై కూడా మూతలు లేకపోవడం, నిర్మాణాల కోసం తవ్విన సెల్లార్ గుంతల్లో నీరు చేరడం, స్లాబులు, గోడల క్యూరింగ్ కోసం వాడిన నీరు రోజుల తరబడి అక్కడే నిల్వ ఉంటూ దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయకపోవడంతో ఇవి మరింత వృద్ధి చెంది కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

న్యూస్‌రీల్

విద్యారత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ భిక్షపతి

మంచాల: గ్రామీణ నిరుపేద విద్యార్థుల ఉన్నతి కోసం పాటుపడిన **డాక్టర్ ఎస్.కె.భిక్షపతి** ప్రొఫెసర్ జయశంకర్ **విద్యారత్న అవార్డు** అందుకున్నారు. రవీంద్రభారతి**లో సోమవారం** నిర్వహించిన కార్యక్రమం**లో తెలంగాణ భాషా** సాంస్కృతిక శాఖ సంచాల**కుడు ఏనుగు నర్సింహా**రెడ్డి అవార్డు ప్రదానం **చేశారు. ఈ సంద**ర్భంగా భిక్షపతి మాట్లాడు**తూ.. అవార్డు అం**దుకోవడం సంతోషంగా **ఉందని, తన బాధ్య**తను మరింత పెంచిందన్నారు.

మరకత శివాలయంలో సినీహీరో పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న నారా రోహిత్

శంకర్‌పల్లి: మండలంలోని చందిప్ప వద్ద ఉన్న మరకత శివాలయంలోని శివలింగాన్ని సినీహీరో నారా రోహిత్ దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఆలయానికి వచ్చిన ఆయన అక్కడే బస చేసి సోమవారం తెల్లవారుజామున బ్రహ్మముహూర్తంలో శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మరకత శివలింగాన్ని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రధాన అర్చకులు సాయిశివ, ప్రమోద్ ఆయనను శాలువాతో సన్మానించి మరకత శివలింగం ఫొటోను అందించారు.

ఆ ఉత్తర్వులు రద్దు చేయండి

కందుకూరు: స్థానిక పీఏసీఎస్ చైర్మన్‌ను తొలగించి కొత్తవారిని నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వును వెనక్కి తీసుకోవాలని పాలకవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కోఆపరేటివ్ కార్యాలయంలో డీసీఓ సుధాకర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పనిచేసిన చైర్మన్ చంద్రశేఖర్‌పై తప్పుడు అభియోగాలు మోపుతూ, ఎలాంటి విచారణ చేపట్టకుండా తొలగించి, కొత్తగా వెంకట్రామ్‌రెడ్డిని ఏకపక్షంగా నియమించడం సరికాదన్నారు. ఉత్తర్వులను రద్దు చేసి పాత చైర్మన్‌నే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో తొలగించిన చైర్మన్ డి.చంద్రశేఖర్, సభ్యులు జి.విజేందర్‌రెడ్డి, ఎస్.శేఖర్‌రెడ్డి, ఎన్.నరసింహ, జి.పర్వతాలు, జి.అంజమ్మ, జి.వెంకటేశ్, కె.యశోద, ఎం.చంద్రునాయక్, పి.ఆనంద్ పాల్గొన్నారు.

నర్సరీ మొక్కలు చెత్తకుప్ప పాలు



చెత్త కుప్పలో పడేసిన మొక్కలు

కేశంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం అభాసుపాలవుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో కార్యక్రమం సరిగా అమలు కావడం లేదు. మండల పరిధిలోని కొత్తపేటలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద నర్సరీ ఏర్పాటు కోసం మొరం మట్టి, ఎర్రమట్టి, సర్వీస్ వైర్, ఎరువులు తదితరాల కోసం సుమారు రూ.40వేలు పంచాయతీ ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు ఖర్చు చేసింది. మొక్కల పెంపకం కోసం ప్రభుత్వం మరిన్ని నిధులు అందించింది. పంచాయతీల్లో 10వేల మొక్కలు నాటేందుకు సిద్ధమైంది. వీటికి అదనంగా మరో మూడువేల మొక్కలు పెంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నిధులపై ఆడిట్ జరుగుతోంది. నర్సరీలో ఉన్న మొక్కలు ఎండిపోయిన విషయాన్ని అధికారులు ఎక్కడ గుర్తిస్తారోననే భయంతో పంచాయతీ కార్యదర్శి జగన్ గ్రామానికి చెందిన కొందరి కూలీల సాయంతో సోమవారం వాటిని పంచాయతీ ట్రాక్టర్‌లో గ్రామ శివారులోని చెత్త వేసే ప్రాంతంలో పారబోశారు.

నిధుల గోల్‌మాల్!

- మహిళా సంఘాల సొమ్ము కాజేసిన వీఓఏ భర్త
- మొత్తం రూ.35 లక్షలు పక్కదారి
- ఆలస్యంగా వెలుగులోకి..



మహిళా సంఘం సభ్యుల డబ్బును సొంతానికి వాడుకున్నట్లు రమేష్ రాసిచ్చిన తీర్మాన పత్రం

నందిగామ: స్త్రీ నిధి నిధులను వీఓఏ (విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్) భర్త పక్కదారి పట్టించాడు. **ఈ ఘటన** మండల పరిధిలోని వీర్లప**ల్లిలో 2023 నుంచి 20**24 వరకు చోటు చేసుకోగా **ఇటీవల వెలుగులోకి** వచ్చింది. వివరాలివీ.. వీర్ల**పల్లిలో 29 మహిళా** సంఘాలు ఉన్నాయి. **గ్రామంలో వీఓఏగా భ**వాని విధులు నిర్వర్తిస్తుం**డగా ఆమె భర్త ర**మేష్ అన్ని వ్యవహారాలు **చూసుకుంటాడు.** గ్రామంలోని రోజా, జ్యోతి, **శ్రీలక్ష్మి, శ్రీనిత్య, రూవ** సంఘాలకు సంబంధించి **బ్యాంకు ద్వారా** రుణాలు ఇప్పిస్తానని **నమ్మబలికాడు. తీర్మా**నాలు చేసి బ్యాంకు ద్వారా **మహిళా సంఘం స**భ్యుల వ్యక్తిగత ఖాతల్లోకి **జమచేయాల్సిన రూ.**8.40 లక్షల రుణాలను తన **ఖాతాలోకి మళ్లించా**డు. విషయం సంఘాల **సభ్యులకు తెలియకుం**డా జాగ్రత్త పడ్డాడు. అడి**గినప్పుడల్లా దాటవేస్తూ** వచ్చాడు.

స్త్రీనిధి నిధులు రూ.27 లక్షలు

మహిళా సంఘాలకు స్త్రీనిధి బ్యాంకు ద్వారా నిధులు మంజూరు చేస్తుంటారు. మహిళలు సొంత వ్యాపారం, ఉపాధి కోసం రుణాలు తీసుకొని నెలవారీ వాయిదాల రూపంలో బ్యాంకుకు తిరిగి ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ చెల్లింపుల విషయం మహిళా సంఘం సభ్యులకు తెలియకపోవడాన్ని అవకాశంగా మలుచుకున్నాడు. ప్రతి నెల సుమారు రూ.1.55 లక్షల నగదును వారి నుంచి వసూలు చేసి, స్త్రీ నిధి బ్యాంకులో చెల్లించకుండా మొత్తం రూ.27 లక్షలు సొంతానికి వాడుకున్నాడు.

వెలుగు చూసిందిలా..

ఇటీవల మహిళా సమాఖ్య అధికారులు గ్రామానికి వెళ్లి గ్రామపెద్దల సమక్షంలో రమేష్‌ను పిలిపించి డబ్బుల విషయమై ప్రశ్నించారు. దీంతో మహిళా సంఘం డబ్బులు, స్త్రీనిధి డబ్బులు మొత్తం రూ. 35 లక్షలు వాడుకుంది నిజమని అంగీకరించాడు. సదరు మొత్తం వీలైనంత త్వరగా కట్టేస్తానని ఓ కాగితం రాసి రెవెన్యూ స్టాంపులు అతికించి సంతకం చేశాడు.

అంతుచిక్కని ప్రశ్నలు

వీఓఏగా భవానీ విధులు నిర్వర్తించాల్సి ఉండగా ఆమె భర్త ఎందుకు జోక్యం చేసుకుంటున్నాడు.. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు.. మహిళా సంఘం సభ్యుల నెలవారీ వాయిదాల డబ్బులు ఏడాది పాటు సొంతానికి వాడుకుంటున్నా ఎందుకు రికవరీ చేయ లేదు అన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి.

రికవరీ చేస్తాం

ఇటీవలే నందిగామ మండలానికి ఏపీఎంగా కొత్తగా వచ్చాను. వీర్లపల్లి మహిళా సంఘం సభ్యుల డబ్బులు వీఓఏ భర్త సొంతానికి వాడుకున్నట్లు తెలిసింది. అతడి నుంచి ఆ మొత్తం రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– భగవంతు, ఏపీఎం, నందిగామ మండలం

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం

వీర్లపల్లి మహిళ సంఘం సభ్యుల నుంచి నెలవారీగా వాయిదాలను వసూలు చేసిన వీఏఓ భర్త రమేష్ తిరిగి స్త్రీనిధి బ్యాంకుకు చెల్లించని విషయం వాస్తవమే. ఇప్పటికే సంబంధిత ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశాం.

– రజిత, అసిస్టెంట్ మేనేజర్, స్త్రీనిధి బ్యాంకు

పొలాల నుంచి ట్రిపుల్‌ఆర్ వద్దు



రైతులతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

- రైతులను రోడ్డున పడేయొద్దు
- వెంటనే అలైన్‌మెంట్ మార్చాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

షాద్‌నగర్: రైతులు పంటలు పండించే పొలాల నుంచి ట్రిపుల్ ఆర్ రోడ్డును నిర్మించొద్దని, అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించబోయే షాద్‌నగర్ పరిధిలోని అయ్యవారిపల్లి శివారులోని వ్యవసాయలను సోమవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంటలు పండే పచ్చని పొలాల గుండా ట్రిపుల్‌ఆర్ రోడ్డు నిర్మిస్తే ఎంతో విలువైన భూములను కోల్పోవడంతో పాటు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు రోడ్డును పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందులకు గురి చేసి బలవంతంగా భూములు తీసుకునేందుకు ప్రయతిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్‌ఆర్ రోడ్డు నిర్మించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, డివిజన్ కార్యదర్శి రాజు, నాయకులు శ్రబును నాయక్, సాయిబాబ, ఈశ్వర్, కుర్మయ్య, పద్మారెడ్డి, మహమ్మద్, బాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన బతుకమ్మతో శాంతిని చాటుదాం

బహుజన బతుకమ్మ వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క

మొయినాబాద్: ప్రకృతి రక్షణే ప్రజల రక్షణగా బహుజన బతుకమ్మతో శాంతి, స్వావలంబన చాటుదామని బహుజన బతుకమ్మ వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరులో సోమవారం రాత్రి బహుజన బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిని విధ్వంసం చేయడం అంటే ప్రజలపై యుద్ధం చేయడమేనని పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేసే ప్రకృతి పూల పండుగా బతుకమ్మ అన్నారు. ప్రజల జీవన విధానంలో మమేకమైన బతుకమ్మ పండుగతో ప్రజలు శాంతిని చాటాలన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, చిలుకూరు మాజీ సర్పంచ్ స్వరూప, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో విమలక్క తదితరులు

దంచికొట్టింది



తుర్కయంజాల్: వరదలో కొట్టుకుపోతున్న కారు



తుర్కయంజాల్: ఆపిల్ అవెన్యూ కాలనీలో నీటమునిగిన అపార్ట్‌మెంట్



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల టీసీఎస్ ముందు జలమయమైన రోడ్డు

జిల్లాల్లోని పలుచోట్ల సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం పరిధిలో వరద ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తుర్కయంజాల్ పరిధిలోని మాసబ్‌చెరువు అలుగు ఉధృతంగా పారింది. పలు కాలనీలు నీటమునిగాయి.

ప్రజావాణిని నిర్లక్ష్యం చేయొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్‌ఓ సంగీత

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరి హాజరు కావాలని అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌ఓ సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వారం 40 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరిండెంట్‌లు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉష

- సాగుకు అనుగుణంగా యూరియా సరఫరా
- జిల్లా వ్యవసాయాధికారి ఉష

ఆమనగల్లు: రైతులు సాగుచేసిన పంటలకు అనుగుణంగా అవసరమైన యూరియా సరఫరా చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఉష తెలిపారు. పట్టణంలోని పీఏసీఎస్, ఆగ్రో రైతు సేవా కేంద్రాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల వద్ద ఉన్న యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు యూరియా కోసం ఆందోళన చెందొద్దని, అవసరమైన నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఆమనగల్లు వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో ఉన్న 90 టన్నుల యూరియాను పీఏసీఎస్ కేంద్రాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పది రోజుల నుంచి యూరియా సరఫరా చేస్తున్నామని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఏడీఏ శోభారాణి, వ్యవసాయాధికారి కవిత, ఏఈఓలు శ్రీకాంత్‌రెడ్డి, మీనాక్షి, గాయత్రి తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టి.. ముప్పతిప్పలు పెట్టి

- కారులో పరారైన ఇద్దరు వ్యక్తులు
- పట్టుకొని దేహశుద్ధి చేసిన గ్రామస్తులు
- గ్రామస్తులపై ఠాణాలో బాధితుల ఫిర్యాదు



గ్రామస్తుల దాడిలో ధ్వంసమైన కారు

చేవెళ్ల: కారుతో బైక్‌ను ఢీకొట్టి.. మూడు గ్రామాల ప్రజలను ముప్పతిప్పలు పెట్టి, పారిపోతున్న ఇద్దరు వ్యక్తులను వెంబడించి పట్టుకున్నారు. దాడి చేసి, కారును ధ్వంసం చేశారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధి రావుపల్లి గ్రామానికి చెందిన చాకలి రాజు.. బైక్‌పై గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని ఫాంహౌస్‌కు వచ్చిన ఎండీ హస్మతుల్లాఖాన్, ఎండీ నవాజ్ అలీఖాన్‌లు తిరిగి ఇన్నోవా కారులో నగరానికి వెళ్తూ యువకుడి బైక్‌ను ఢీకొట్టారు. అనంతరం కారును ఆపకుండా వెళ్తుండటంతో గమనించిన స్థానికులు.. ముడిమ్యాల గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో వారు కారును ఆపటానికి యత్నించినా, తప్పించుకొని అతి వేగంతో కుమ్మెర వైపు వెళ్లారు. దీంతో ముడిమ్యాల గ్రామస్తులు.. కుమ్మెర గ్రామస్తులకు విషయం తెలపగా.. వారు కారును అడ్డుకున్నారు. మూడు గ్రామాల వారు ఏకమయ్యారు. జరిగిన సంఘటన గురించి కారులోని వ్యక్తులను ప్రశ్నించగా.. సదరు వ్యక్తులు గ్రామస్తులపై తిరగబడ్డారు. దీంతో ఆగ్రహించిన ఆయా గ్రామాల ప్రజలు.. కారును ధ్వంసం చేశారు. ఇద్దరిని చితకబాదారు. అనంతరం ప్రమాదానికి కారణమైన వ్యక్తులు.. జరిగిన సంఘటనను వివరిస్తూ గ్రామస్తులపై చేవెళ్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మాట్లాడారు. ఎవరైనా తప్పు చేసినా, రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారు పారిపోతున్నా.. వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించాలే కానీ.. దాడి చేయరాదని సూచించారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

మాడ్గుల: అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ వేణుగోపాల్ రావు తెలిపిన వివరాల ప్రకారం .. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో వాహనాలు ఆపి, డ్రైవర్లను వివరాలు కోరగా.. ఎలాంటి అనుమతులు లేవని చెప్పారు. దీంతో వాటిని సీజ్ చేశారు. డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

జనావాసాలు.. జలమయం



ఇంజాపూర్- తొర్రూర్ రోడ్డుపై వరద ప్రవాహం

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం సాయంత్రం మొదలు రాత్రి వరకు భారీ వర్షం పడింది. 7.5 సె.మి. వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి పలు ప్రాంతాల్లో 10 సె.మి. వర్షం కురిసింది. దీంతో తుర్కయంజాల్ మాసబ్ చెరువుకు వరద పోటెత్తింది. అక్కడి నుంచి నుంచి ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువుకు నీరు ప్రవహించే వాగు జలప్రవాహానికి ఆపిల్ అవెన్యూ, ఇందిరమ్మ కాలనీలు నీటిలో తేలియాడాయి. సోమవారం సాయంత్రం భారీ వర్షం పడగా.. రెండు ఫీట్లకు పైగా నీరు అపార్ట్‌మెంట్లలో చేరింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో గడిపారు.

వద్దన్నా వినకుండా..

ఇంజాపూర్ నుంచి తొర్రూర్‌కు వెళ్లే మార్గంలో సుమారు 200 ఫీట్ల వెడల్పుతో నీరు ప్రవహిస్తుండటంతో.. అప్రమత్తమైన మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. అడ్డుగా రాళ్లను పెట్టించారు. ఇది లెక్కచేయని బైరమాల్‌గూడకు చెందిన ముగ్గురు యువకులు.. వరదలో కారును ముందుకు పోనిచ్చారు. ప్రవాహం పెరగడంతో కారు ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు తగిలించి నిలిపారు. అతి కష్టం మీద, మున్సిపల్ సిబ్బంది సహకారంతో ముగ్గురు యువకులను బయటకు రప్పించారు.



ఆదిబట్లలో ట్రాఫిక్ జామ్

చెరువులు కావు.. రహదారులు

ఇబ్రహీంపట్నం రూరల్: పట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్నంలోని సంతోష్ థియేటర్ ఎదుట, ఆదిబట్ల టీసీఎస్ రోడ్డు చెరువును తలపించాయి.

దంచికొట్టి.. దడపుట్టించి



కొడంగల్ : ఉధృతంగా అలుగు పారుతున్న పెద్ద నందిగామ చెరువు

వరుణుడి కుండపోతకు పల్లెలు, పట్టణాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. ఏకధాటి వర్షాలతో వాగులు వంకలు జల ప్రవాహంతో ఉరకలెత్తుతున్నాయి. చెరువులు అలుగు పోస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగి, రైతన్నకు నష్టాన్ని మిగిల్చాయి. రహదారులు, కల్వర్టులు దెబ్బతిని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

వరుణుడి బీభత్సం.. రాత్రికిరాత్రే అతలాకుతలం

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- అలుగుపోస్తున్న చెరువులు, కుంటలు
- నీటమునిగిన పంటపొలాలు, దెబ్బతిన్న రోడ్లు
- స్తంభించిన రవాణా, అస్తవ్యస్తంగా జనజీవనం

కొడంగల్/కొడంగల్ రూరల్/దుద్యాల్/ దౌల్తాబాద్: వికారాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా పడింది. కొడంగల్ మండలంలో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. హుస్సేన్‌పూర్ రోడ్డు వరద ఉధృతికి కోసుకు పోయింది. పర్సాపూర్‌లో ప్రధాన రహదారిపై బురదలో వాహనాలు దిగబడ్డాయి. అంగడిరాయిచూర్ వాగు జోరుగా ప్రవహిస్తోంది. కొడంగల్ బైపాస్ నిర్మాణం కోసం వేసిన మట్టి వర్షం దాటికి కొట్టుకొని పోయింది. మండలంలోని ర్యాలపేట చెరువుకు గండి పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు గండిని పూడ్చడానికి ప్రయత్నించారు. ఇరిగేషన్ అధికారులు గండిని పూడ్చారు. దుద్యాల్ మండలంలో అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. చెరువులు అలుగు పారుతున్నాయి. కుదురుమల్ల గ్రామ సమీపంలో వాగుపై వంతెన నిర్మాణం కోసం తెచ్చిన ఇటాచీ, కాంక్రీట్ మిక్సింగ్ మిషన్ నీటి మధ్యలో ఇరుక్కుపోయాయి. దుద్యాల్ గేటు వద్ద నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ చుట్టూ నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దౌల్తాబాద్ మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. చాలా గ్రామాల్లో బీటీ రోడ్లు ధ్వంసమయ్యాయి. మట్టి రోడ్లు కోసుకుపోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇందాపూర్ – కుదురుమళ్ల మధ్య వాగు ఉధృతంగా పారడంతో రాకపోకలు స్తంభించాయి. గుముడాల – బిచ్చాల రోడ్డు ధ్వంసమైంది. దేశాయిపల్లి, దౌల్తాబాద్ గ్రామాల మధ్య ఉన్న చింతల్ చెరువు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. యాంకి గ్రామంలో చెరువు కింద పంటలు నీట మునిగి పోవడంతో రైతులు నష్టపోయారు.



కొడంగల్ రూరల్: ర్యాలపేట చెరువుకు పడిన గండిని పూడ్చిన అధికారులు



దుద్యాల్: కుదురుమల్ల వాగులో ఇరుక్కుపోయిన ఇటాచీ వాహనం

సాల్వీడు చెరువుకు గండి

కుల్కచర్ల: ప్రస్తుత వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. సోమవారం తెల్లవారు జామున కురిసిన భారీ వానకు మండల పరిధి సాల్వీడు గ్రామ చెరువుకు గండి పడింది. దీంతో అప్రమత్తమైన గ్రామస్తులు మట్టిని పోసి గండిని పూడ్చారు. నీటి ప్రవాహాన్ని ఆపారు. అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.



చెరువుకు మరమ్మతు చేస్తున్న గ్రామస్తులు



కొడంగల్: కోతకు గురైన హుస్సేన్‌పూర్ రోడ్డు



దౌల్తాబాద్: చింతల్ చెరువు దాటుతున్న రైతులు



దౌల్తాబాద్: ప్రవహిస్తున్న సుల్తాన్‌పూర్ వాగు

రైలు ఢీకొని యువకుడి మృతి

సికింద్రాబాద్: పట్టాల పక్కనుంచి నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కేతావత్ నారాయణ తెలిపిన మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన సుబోద్ కుమార్(25) గుండ్ల పోచంపల్లిలోని ఫ్యాక్టరీ ఏరియాలో రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. ఈ నెల 21న సాయంత్రం కూరగాయలు కొనుగోలు చేసేందుకు పోచంపల్లి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రైలు పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుకవైపు నుంచి వచ్చిన రైలు సుబోద్ కుమార్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

అక్కినేని నాగేశ్వరరావు గొప్ప నటుడు

చిక్కడపల్లి: అక్కినేని నాగేశ్వర్‌రావు గొప్ప నటుడని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమవారం రాత్రి రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసురావుకు 'అక్కినేని జీవితం సాఫల్య పురస్కారం'ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మైన్స్ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, సాహితీవేత్తలు ఎంకే రాము, జంగయ్యగౌడ్, సుబ్బరాయశర్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

తప్పని యూరియా తిప్పలు

తెల్లవారు జాము 4గంటలకే క్యూలైన్లో రైతులు



చెప్పులను క్యూలైన్‌లో పెట్టిన రైతులు

నందిగామ: యూరియా కోసం అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. రేయింబవళ్లు పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. చెప్పులు, రాళ్లు క్యూలైన్లో పెట్టి నిరీక్షిస్తున్నారు. మండల పరిధి చేగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సోమవారం యూరియా వస్తుందనే సమాచారంతో పరిసర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున తెల్లవారు జామున 4 గంటలకు కేంద్రం వద్ద బారులు తీరారు. అనంతరం లారీలో 450 బస్తాల యూరియా వచ్చింది. పోలీసుల సహకారంతో నిర్వాహకులు పంపిణీ చేశారు. చాలా మందికి యూరియా అందకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తూ.. నిరాశతో వెనుతిరిగారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు

సీఐ నాగరాజుగౌడ్



హయత్‌నగర్: ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజుగౌడ్ హెచ్చరించారు. సోమవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పల్లవి ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ పేరుతో తోటి విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మానసికంగా వేధించడం తగదని సూచించారు. కొత్తగా వచ్చే వారిపట్ల సోదర భావంతో మెలగాలని, కలిసిమెలిసి చదువుకోవాలని చెప్పారు. క్రమశిక్షణ పట్టుదలతో విద్యనభ్యసించి, భవిష్యత్తును చక్కదిద్దుకోవాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే.. జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. ఒక్కసారి శిక్ష అనుభవిస్తే.. అది జీవితాంతం వెంటాడుతుందని, జీవితం అంధకారం అవుతుందని వివరించారు. కళాశాలలో ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నాగోలు: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. నాగోలు పోలీసులు తెలిపిన మేరకు.. మహబూబాబాద్ జిల్లా రెడ్డాల గ్రామంలో బోడ స్వరూప(35), బోడ రవి దంపతులు నివాసముంటున్నారు. ఈ క్రమంలో అనిల్ కుమార్‌తో స్వరూపకు పరిచయం ఏర్పడింది. దీంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అనిల్ మాయ మాటలు నమ్మిన స్వరూప ఈ నెల 21న నాగోలు బ్లెండ్ కాలనీలో నివాసం ఉండే అనిల్ కుమార్ దగ్గరకు వచ్చింది.స్వరూప హైదరాబాద్‌కు చేరుకున్న విషయం తెలుసుకున్న భర్త ఫోన్ చేయగా తాను అనిల్‌తో ఉన్నాను అని చెప్పింది. ఆదివారం రాత్రి అనిల్ కుమార్ నివాసంలో అనుమానాస్పద స్థితిలో బాత్‌రూమ్‌లో ఆత్మహత్య చేసుకొని కనిపించింది.స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు ఊరట

చేవెళ్ల ఎంపీ, జీఎస్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: జీఎస్టీ సంస్కరణలు దేశాన్ని మరింత బలోపేతం చేస్తాయని, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పేదలు, రైతులు, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఊరటనిచ్చిందని చేవెళ్ల ఎంపీ, జీఎస్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై వికారాబాద్‌లోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తగ్గిన జీఎస్టీతో ప్రజలకు కొనుగోలు సామర్థ్యం పెరుగుతుందన్నారు. వస్తు వినియోగ పన్ను తగ్గింపు అంశం ప్రజల్లోకి చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని మీడియాను కోరారు. జీఎస్టీ తగ్గింపును వ్యక్తిగత, రాజకీయ కోణాల్లో కాకుండా ప్రజాప్రయోజనాల అంశంగా పరిగణించాలని రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. కొన్ని శక్తులు దేశాన్ని విభజించేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. జీఎస్టీ అంశాన్ని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

వారికోసమే అలైన్‌మెంట్ మార్పు..

బడా బాబుల భూములను కాపాడేందుకే రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చారని ఎంపీ కొండా ఆరోపించారు. ప్రస్తుత ప్లాన్‌లో పేద, మధ్య తరగతి రైతుల భూములే పోతున్నట్లు తెలుస్తోందన్నారు. ట్రిపుల్ ఆర్ కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మాత్రమే ఇస్తుందని, భూసేకరణ, అలైన్‌మెంట్ అంశాలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందని స్పష్టంచేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్ని పనులూ తానే చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

జిల్లా అధ్యక్షుడికి చేదు అనుభవం..

ఇదిలా ఉండగా ప్రెస్‌మీట్ చివరి దశలో అక్కడికి వచ్చిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి సాధారణ కార్యకర్తలా సమావేశంలో కూర్చున్నారు. ప్రెస్ మీట్ అనంతరం బయటకు వచ్చేశారు. అదే గదిలో కూర్చున్న ఎంపీ ప్రెస్‌మీట్ తర్వాత డోర్ పెట్టేసి పార్టీ నాయకులతో మాట్లాడారు. డోర్ తీసుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన జిల్లా అధ్యక్షుడికి మీరు అక్కడే వెయిట్ చేయండి అని సూచించారు. సమావేశం అనంతరం ఎంపీతో మాట్లేందుకు ప్రయత్నించినా నేను తిరుపతి వెళ్తున్నా, ఫ్లైట్ టైమ్ అయిపోతుందంటూ కారులో హైదరాబాద్ బయల్దేరారు. ఈ సమావేశంలో జీఎస్టీ జిల్లా ప్రచారక్ ఈశ్వరప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, రమేశ్‌కుమార్, పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, సీనియర్ నాయకులు వడ్లనందు, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, నందు, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్రసేన్ మహారాజ్ స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధి

ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

శంషాబాద్: సేవే నిజమైన సంపద అని చాటి చెప్పిన అగ్రసేన్ మహారాజ్ స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధి వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు అన్నారు. శంషాబాద్ క్లాసిక్ కన్వెన్షన్‌లో తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అగ్రసేన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అగ్రసేన్ గొప్పసామాజిక శిల్పి అని ఆయన కొనియాడారు. ఆయన ప్రవేశ పెట్టిన ఒక ఇటుక.. ఒక నాణేం అన్న సూత్రం ప్రపంచంలోనే మొదటి స్టార్టప్ ఇన్‌క్యూబేటర్ అని పేర్కొన్నారు, సంపద కొద్ది మందికే పరిమితం చేయకుండా సమాజంలో పంపిణీ చేసినపుడే అభివృద్ధి సాధ్యమని నిరూపించిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా, ఉపాధ్యక్షుడు రూపేష్ అగర్వాల్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

సాక్షి, సిటీ బ్యూరో: మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులపై దాడికి పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాలని తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కిరణ్, ప్రధాన కార్యదర్శి మాదాల కిరణ్, కోశాధికారి ఎల్.రమేష్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం సుమారు 150 మంది సూపరింటెండెంట్ కార్యాలయాన్ని చుట్టుముట్టి చంపేస్తామంటూ బెదిరించడం క్షమించరాని నేరమన్నారు. వైద్యులుపై వివిధ ప్రాంతాల్లో నిత్యం దాడులు జరుగుతున్నాయని, వీటిని అరికట్టకుంటే పనిచేయలేమని పేర్కొన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం వెంటనే నిందితులను అరెస్టు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

25 వరకు ప్రధాని ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు

గన్‌ఫౌండ్రీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 25 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించనున్నట్లు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, తెలిపారు. నరేంద్రీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రలకు తెలియజేసేలా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్లమెంటు సభ్యులు డీకే అరుణ, కొండా విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.